సాక్షి విశాఖపట్నం

బుధవారం । 18 । అక్టోబర్ । 2023



సాగరదుర్గను చూసొద్దాం..

ప్రకృతి అందాలకు నెలవైన విశాఖలో కడలి తీరాన సాగర దుర్గ సన్నిధి దసరా శోభతో అలరారుతోంది.

IIలో



హార్బర్‌కు అదనపు హంగులు

విశాఖ ఫిషింగ్ హార్బర్‌కు అదనపు హంగులు సమకూరనున్నాయి. ఇందుకు అవసరమైన నిధులు మంజూరు కానున్నాయి.

IIలో

ఫిర్యాదులకు తక్షణమే పరిష్కారం



డయల్ యువర్ సీపీ కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ అధికారులను ఆదేశించారు.

IIలో

న్యూస్‌రీల్

ధాన్యలక్ష్మిగా కనకమహాలక్ష్మి



ధాన్యలక్ష్మిగా సిరులతల్లి

డాబాగార్డెన్స్: శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా కనకమహాలక్ష్మి మంగళవారం ధాన్యలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి లడ్డూలతో పూజ నిర్వహించారు. ముందుగా సంకల్పం, మండపారాధన, కలశస్థాపన, సప్తశతి, మహా విద్యా, శ్రీచక్ర నవావర్ణార్చన జరిపారు. లడ్డూల దాతలు నగరానికి చెందిన ఎం.సురేష్, మాధవి దంపతులు, పట్టుచీరలు అందించిన లక్కీ, సౌత్ ఇండియా షాపింగ్ మాల్ ప్రతినిధులు, అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. బుధవారం ధైర్యలక్ష్మిగా అమ్మవారు దర్శనమిస్తారని, తులసి పూజ నిర్వహిస్తున్నట్లు ఈవో శిరీష తెలిపారు.

అప్పన్న హుండీ ఆదాయం రూ.1.10 కోట్లు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి హుండీ ఆదాయం గడిచిన 20 రోజులకు కోటి 10 లక్షల 29 వేల 970 రూపాయలు వచ్చినట్లు ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. సింహగిరిపై యాత్రికసదన్‌లో మంగళవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. నగదుతో పాటు 5 గ్రాముల బంగారం, వెండి 7.050 కిలోలు వచ్చినట్లు పేర్కొన్నారు. అలాగే 33 యూఎస్‌ఏ డాలర్స్, 148 మలేషియా రింగ్స్, 55 ఆస్ట్రేలియా డాలర్స్, 105 సౌదీ అరేబియా రియాల్స్, 125 యూఏఈ దిర్హమ్స్ లభించినట్లు తెలిపారు.

ఐఎన్‌ఎస్ డేగాలో వసతి గృహం ప్రారంభం



వసతి గృహం ప్రారంభిస్తున్న వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్

సింధియా: ఐఎన్‌ఎస్ డేగాలో ఆరు అంతస్తుల నావికుల వసతి గృహాన్ని మంగళవారం తూర్పు నావికా దళ చీఫ్ కమాండింగ్ ఫ్లాగ్ ఆఫీసర్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ ప్రారంభించారు. ఈ వసతి గృహంలో స్టేట్ ఆఫ్ ఆర్ట్ ఇండస్ట్రియల్ కిచెన్, డైనింగ్ హాల్, రీక్రియేషన్ సెంటర్ తదితర సౌకర్యాలు కల్పించినట్లు చెప్పారు.

ఈఏసీ సభ్యుడిగా ఆచార్య పి.జె.రావు



ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం కెమికల్ ఇంజినీరింగ్ విభాగం విశ్రాంత ఆచార్యుడు డాక్టర్ పి.జగన్నాథరావు ఎన్విరాన్‌మెంట్ అప్రైజల్ కమిటీ(ఈఏసీ) సభ్యుడిగా నియమితులయ్యారు. భారత పర్యావరణ, అటవీ, పర్యావరణ మార్పు మంత్రిత్వ శాఖకు చెందిన ఇండస్ట్రీ-3 విభాగానికి ఈఏసీ సభ్యుడిగా ఆయన వ్యవహరిస్తారు. బల్క్ డ్రగ్ ఇండస్ట్రీ, ఫెర్టిలైజర్ ఇండస్ట్రీ, పెయింట్ మ్యానుఫ్యాక్చరింగ్, ఆర్గానిక్ కెమికల్స్ ఇండస్ట్రీ, డై మ్యానుఫ్యాక్చరింగ్ తదితర పరిశ్రమల స్థాపనలో అవసరమైన పర్యావరణ అనుమతులను ఈఏసీ పర్యవేక్షిస్తుంది. ఇటువంటి కీలక కమిటీ సభ్యుడిగా ఏయూ ఆచార్యుడు నియమితులు కావడంపై ఇంజినీరింగ్ కళాశాల ఆచార్యులు హర్షం వ్యక్తం చేశారు. ఆచార్య పి.జె రావును అభినందించారు.

ఈవీఎంలలో సాంకేతిక లోపాలు లేకుండా చర్యలు

ఆరిలోవ: ఈవీఎంలలో సాంకేతిక లోపాలు లేకుండా చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. రూరల్ తహసీల్దార్ కార్యాలయం వద్ద ఈవీఎంల గొడౌన్‌లో వీవీప్యాడ్‌లు, ఈవీఎం యంత్రాల తొలి దశ తనిఖీ(ఎఫ్‌ఎల్‌సీ) సోమవారం నుంచి ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా మంగళవారం సీపీ రవిశంకర్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మలతో కలసి కలెక్టర్ ఈవీఎం గొడౌన్‌ను సందర్శించారు. అక్కడ జరుగుతున్న యంత్రాల తనిఖీని పరిశీలించారు. వివిధ రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో అధికారులు ఈవీఎంలను తనిఖీ చేస్తున్నారన్నారు. బెంగళూరు నుంచి వచ్చిన బెల్ ఇంజినీర్లు నిర్వహణలో వెబ్ క్యాస్టింగ్, పోలీస్ బందోబస్తు మధ్య ఈ తనిఖీ జరుగుతోందన్నారు.

డీసీఐలో అవినీతిదే 'విక్టరీ'

- నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారంలో సస్పెన్షన్‌తో సరి
- కనీసం కేసు పెట్టని అధికారులు
- డీసీఐ మాజీ ఎండీ విక్టర్ వ్యవహారంలో లోగుట్టు ఏమిటో?
- చివరి వరకు వేతనం ఇచ్చి, మరీ సాగనంపిన వైనం



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(డీసీఐ)లో ఉన్నతాధికారుల తీరు విమర్శలపాలవుతూనే ఉంది. నకిలీ సర్టిఫికెట్లతో ఏకంగా డీసీఐ ఎండీ, సీఈవోగా మొన్నటి వరకు వ్యవహరించిన విక్టర్‌పై కనీసం కేసు కూడా నమోదు చేయని వ్యవహారం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. కేవలం డిస్మిస్‌తో ఈ అంశాన్ని ముగించిన తీరు ఆశ్చర్యం గొల్పుతోంది. మరో వైపు చివరి రోజు వరకు ఆయనకు వేతనం చెల్లించి మరీ గౌరవంగా పంపించిన తీరు పలు అనుమానాలకు తావిస్తోంది. విక్టర్ కంటే ముందు మరో అధికారి నకిలీ సర్టిఫికెట్లతో అధికారం చెలాయించారు. ఆ తర్వాత విక్టర్ అదే తరహాలో ఏకంగా ఎండీ స్థానంలో కూర్చున్నారు. దీనిపై హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలైన తర్వాత కానీ విక్టర్‌పై చర్యలకు ఉపక్రమించలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతంలో కూడా డీసీఐలో సీఎఫ్‌వో బన్సాల్ నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారంలో 2021 మార్చి 19న డిస్మిస్ అయిన విషయాన్ని ఉద్యోగులు గుర్తు చేస్తున్నారు. ప్రస్తుతం పదవిలో ఉన్న మరో ఉన్నతాధికారి సర్టిఫికెట్లపైనా ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

పిల్ వేసిన తర్వాత..

డీసీఐ ఎండీగా విక్టర్ తప్పుడు పత్రాలతో ఉద్యోగం పొందాడని పేర్కొంటూ రుజువులతో సహా రాష్ట్ర హైకోర్టులో 2022 జూలై 14న పిల్ దాఖలైంది. ఈ వ్యవహారంపై పలు కథనాలు కూడా వెలువడ్డాయి. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో 2022 జూలై 15న విక్టర్‌ను సస్పెండ్ చేశారు. దీనిపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామంటూ కాలం వెళ్లదీశారు. తీరా విచారణ చేశామని చేతులు దులుపుకుంటూ మార్చి 2023లో డిస్మిస్ చేశారు. అది కూడా అప్పటి పోర్టు చైర్మన్ రామ్మోహనరావు తన పదవీ కాలం ముగుస్తున్న రోజున హడావిడిగా సంతకం చేసి వెళ్లారు. అయితే అప్పటివరకు విక్టర్‌కు వేతన భత్యాలన్నీ చెల్లించి మరీ సాగనంపడం ఇప్పుడు చర్చనీయాంశమవుతోంది.

తప్పుడు పత్రాలతో డీసీఐ ఎండీ పదవి పొందితే.. క్రిమినల్ కేసు నమోదు చేయడంతో పాటు ఆయన పొందిన వాటన్నింటినీ రికవరీ చేయాలి. అయితే ఇందుకు భిన్నంగా తప్పు తెలుసుకుని వెళ్లారని కితాబునిస్తూ సస్పెండ్ కాలం నుంచి డిస్మిస్ కాలం వరకు అంటే సుమారు 8 నెలల పాటు జీత భత్యాలు చెల్లించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఆయన్ని గౌరవంగా సాగనంపడం పట్ల డీసీఐలోని కొందరు మండిపడుతున్నారు. ఇది సంస్థను ఆర్థికంగా దెబ్బతీయడంతో పాటు తప్పు చేసినా తమకేమీ కాదన్న ధీమా, మరిన్ని తప్పులు చేసే అవకాశం కల్పించడమే అవుతుందని అభిప్రాయపడుతున్నారు.

షీలానగర్–సబ్బవరం హైవేకి కదలిక!

- నెలాఖరుకల్లా టెండర్లకు ఆహ్వానం
- నాలుగు నుంచి ఆరు వరుసలకు పెంపు
- ప్రాజెక్టు వ్యయం రూ.980 కోట్లు
- రెండేళ్లలో పూర్తి చేయాలని లక్ష్యం



షీలానగర్ జంక్షన్ నుంచి పోర్టుకు వెళ్లే రోడ్డు

సాక్షి, విశాఖపట్నం: విశాఖ నగరానికి ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి, వైజాగ్ పోర్టుకు భారీ వాహనాల రాకపోకలు సజావుగా సాగడానికి ఉద్దేశించిన షీలానగర్-సబ్బవరం హైవేకి కదలిక వచ్చింది. రోజురోజుకు నగరంతో పాటు పోర్టుకు వాహనాల తాకిడి అధికమవుతోంది. అనకాపల్లి నుంచి కూర్మన్నపాలెం, గాజువాకల మీదుగా షీలానగర్ వరకు ట్రాఫిక్ రద్దీ చాలా ఎక్కువగా ఉంటోంది. దీనిని దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం సుమారు ఎనిమిదేళ్ల క్రితం సాగరమాల పథకంలో ప్రత్యేకంగా ఈ రోడ్డును మంజూరు చేసింది. తొలుత నాలుగు వరసల్లో 12.5 కిలోమీటర్ల మేర దీనిని నిర్మించడానికి ప్రతిపాదించింది. ఇందుకు రూ.350 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేసింది. దీని నిర్మాణ బాధ్యతను జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ)కు అప్పగించింది. రోడ్డు నిర్మాణానికి సుమారు 80 హెక్టార్ల భూమిని సేకరించాల్సి వచ్చింది. ఈ రోడ్డు పనులు చేపట్టేందుకు సన్నద్ధమయ్యే సమయంలో భూసేకరణతో పాటు ఇతరత్రా పలు అవాంతరాలెదురయ్యాయి. దీంతో ఈ రోడ్డు నిర్మాణ ప్రక్రియలో జాప్యం జరుగుతూ, వాయిదా పడుతూ వచ్చింది. క్రమంగా అడ్డంకులను ఒక్కొక్కటిగా అధిగమించడంతో ఇప్పుడు దీని నిర్మాణానికి మార్గం సుగమం అయింది. మొదట నాలుగు వరుసల్లో నిర్మించాలని నిర్ణయించినప్పటికీ పెరుగుతున్న ట్రాఫిక్‌కు అనుగుణంగా ఆరు లేన్లకు పెంచారు. అంతేకాదు.. సబ్బవరం బైపాస్ రోడ్డును కూడా దీనిలోనే కలిపారు. దీంతో పాటే దీని అంచనా వ్యయాన్ని కూడా రూ.350 కోట్ల నుంచి రూ.980 కోట్లకు పెంపుదల చేశారు. షీలానగర్-సబ్బవరంల మధ్య అవసరమైన చోట ఫ్లైఓవర్లను కూడా నిర్మించనున్నారు.

నెలాఖరుకల్లా టెండర్లు

షీలానగర్-సబ్బవరం హైవే నాలుగు లేన్ల నుంచి ఆరు లేన్లకు పెంపుదలపై ఇప్పటికే డీపీఆర్‌ను కూడా సిద్ధం చేశారు. ఈ రోడ్డుకు అన్ని అడ్డంకులు తొలగడంతో నెలాఖరుకల్లా ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు టెండర్లు పిలవడానికి సన్నద్ధమవుతున్నారు. టెండర్ల ఖరారు అనంతరం రోడ్డు నిర్మాణ పనులు చేపడతారు. రెండేళ్లలో ఆరు వరసల్లో ఈ రోడ్డును పూర్తి చేయనున్నారు. ఈ హైవేను అనకాపల్లి-ఆనందపురం ఆరు వరుసల జాతీయ రహదారికి అనుసంధానం చేస్తారు. ఈ రోడ్డు అందుబాటులోకి వస్తే అనకాపల్లి, సబ్బవరం జంక్షన్, షీలానగర్, కాన్వెంట్ జంక్షన్, పోర్టు సహా కంటైనర్ టెర్మినల్ వరకు భారీ వాహనాలు, లారీలు, కంటైనర్లు నేరుగా ఈ హైవే పైనే రాకపోకలు సాగిస్తాయి. దీంతో ఇన్నాళ్లూ అనకాపల్లి-ఎన్‌ఏడీ జంక్షన్ల మధ్య షీలానగర్, గాజువాక, కూర్మన్నపాలెం, లంకెలపాలెంల మీదుగా వెళ్లే వాహనాలు ఎన్‌హెచ్-16పై ప్రయాణించాల్సిన అవసరం ఉండదు. ఫలితంగా నగరంలో ట్రాఫిక్ రద్దీ తగ్గి వాహనచోదకులకు ఉపశమనం కలగనుంది.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వైఎస్సార్ సీపీ రీజనల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, ఎంప్లాయీస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఆనందరావు, సిటు గౌరవ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి

డాబాగార్డెన్స్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి జీవీఎంసీ ఎంప్లాయీస్ యూనియన్, సిటు ప్రతినిధులు క్షీరాభిషేకం చేశారు. జీవీఎంసీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీవో 25 ప్రకారం సహజ మరణానికి రూ.2లక్షలు, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5 లక్షలు ఎక్స్‌గ్రేసియా చెల్లించే అంశాన్ని ఈ నెల 19న జరిగే కౌన్సిల్ సమావేశంలో చర్చించి ఆమోదించనున్నారు. ఈ నేపథ్యంలో జీవీఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఎం.ఆనందరావు నేతృత్వంలో ప్రతినిధులు ఎండాడలోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయం ప్రాంగణంలో మంగళవారం పార్టీ రీజినల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డిని కలిసి సత్కరించారు. సిటు యూనియన్ గౌరవ అధ్యక్షుడు పి.వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ పలు సమస్యలను యూనియన్ నాయకుడు ఆనందరావు తన దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. అందులో ప్రధానంగా యూజీడీ కార్మికులు, డ్రైవర్లు, మలేరియా సిబ్బందికి ఆరోగ్య అలవెన్స్ ఇప్పించేందుకు విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామన్నారు. సీఎఫ్ఎంఎస్ ద్వారా జీతాలు రావడం వల్ల ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందరికీ రావడం లేదని, పీహెచ్‌సీ సూపర్‌వైజర్లు, వర్కర్ కమ్ డ్రైవర్లకు సెమీ స్కిల్డ్ జీతాలు ఇవ్వాలని, ఇంజినీరింగ్, వాటర్ సప్లై, యూజీడీలో సెమీ స్కిల్డ్ జీతం తీసుకొని, అనుభవం, అర్హత గల వారిని స్కిల్డ్‌గా మార్చమని ఆయన కోరినట్లు చెప్పారు. కెనాల్‌లో నీటి పని చేస్తున్న 105 మందికి రూ.15 వేలు నుంచి రూ.18,500కు, అన్‌స్కిల్డ్‌గా పని చేస్తూ, ఐటీఐ సర్టిఫికెట్, 10 ఏళ్ల అనుభవం ఉన్న వారికి రూ.15 వేల నుంచి రూ.18,500కు జీతం పెంచేలా కౌన్సిల్‌లో ఆమోదం చేయిస్తామని చెప్పారు. యూనియన్ల నాయకులు కుమార్, ఎర్రాజీ, సత్యం, రామకృష్ణ, కృష్ణ, రాజా, శ్రీరామ్మూర్తి, ప్రసాద్, రవి, గురువోజీ, పార్టీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు, కార్యాలయ ఇన్‌చార్జి రవిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దామా సుబ్బారావు, జీవీఎంసీ వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



వైవీకి వినతిపత్రం అందజేస్తున్న సిటు నాయకులు

విశాఖ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం

- జిల్లాను అన్ని హంగులతో సుందరంగా తీర్చిదిద్దాలి
- వీఎంఆర్‌డీఏ అధికారులతో సమీక్షలో మంత్రి ఆదిమూలపు సురేష్ ఆదేశం



వీఎంఆర్‌డీఏ ప్రాజెక్టుల ప్రగతిపై సమీక్షిస్తున్న రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్

దొండపర్తి: విశాఖ అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా పయనించేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ అధికారులను ఆదేశించారు. మంగళవారం వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో సంస్థ ద్వారా విశాఖలో చేపట్టిన వివిధ ప్రాజెక్టులు, అభివృద్ధి పనుల ప్రగతిపై కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ జిల్లా అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. నగరంలో గుంతలు లేని రహదారులు, పరిశుభ్రత, సుందరీకరణ పనులు వంటివి చేపట్టాలని చెప్పారు. అదే విధంగా వేస్ట్ మేనేజ్‌మెంట్ పనులు సవ్యంగా జరిగేటట్లు చూడాలన్నారు. అమ్యూజ్‌మెంట్, థీమ్ పార్కుల ఏర్పాటు, ఎంటర్‌టైన్‌మెంట్ కార్యక్రమాల రూపకల్పన చేయాలని సూచించారు. విశాఖకు సముద్రం ప్రకృతి ప్రసాదించిన వరమని, పలు బీచ్‌లను సుందరంగా అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులో తీసుకురావాలని ఆదేశించారు. వీఎంఆర్‌డీఏ పరిధిలో పెండింగ్‌లో ఉన్న పలు ప్రాజెక్టులను త్వరతగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని చెప్పారు. కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ జాయింట్ కమిషనర్ రవీంద్ర, కార్యదర్శి రంగయ్య, ఇంజనీరింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

'దసరా' ప్రత్యేక సర్వీసుల్లో సాధారణ చార్జీలే..

- రానుపోనూ రిజర్వేషన్ చేసుకుంటే 10 శాతం రాయితీ
- భవానీ భక్తులకు ప్రత్యేక బస్సులు సిద్ధం

డాబాగార్డెన్స్: దసరా సందర్భంగా సొంత గ్రామాలకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం సిద్ధం చేసిన ప్రత్యేక సర్వీసులను సాధారణ చార్జీలతోనే నడుపుతున్నట్లు విజయనగరం జోన్-1 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చింతా రవికుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. విజయనగరం జోన్ నుంచి హైదరాబాద్‌కు షెడ్యూల్ బస్సులు 5 కాగా.. 32 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు చెప్పారు. విజయవాడకు షెడ్యూల్ బస్సులు 26 కాగా, 110 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు వివరించారు. రానుపోను ముందస్తుగా రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులకు చార్జీలో 10 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు చెప్పారు. అన్ని బస్ స్టేషన్లలో ప్రయాణికుల రద్దీకి సరిపడే బస్సులు నడిపేందుకు.. అధికారులకు స్పెషల్ డ్యూటీలు వేశామన్నారు. ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ప్రైవేట్ బస్సులను ఆశ్రయించాల్సిన అవసరమే లేదని, ఈ సదావకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే భవానీ భక్తులకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు వివరించారు. కావాల్సిన వారు డిపోల్లో సంప్రదించాలని సూచించారు.

టీ-20 మ్యాచ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

- నవంబర్ 23వ తేదీన భారత్- ఆస్ట్రేలియా మ్యాచ్
- సాగరతీరంలో భారీ స్క్రీన్ ఏర్పాటుకు సన్నాహాలు
- అన్ని శాఖల సమన్వయంతో మ్యాచ్‌ను విజయవంతం చేస్తాం
- మ్యాచ్ నిర్వాహక కమిటీ సమీక్షలో కలెక్టర్ మల్లికార్జున



వివరాలు వెల్లడిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, చిత్రంలో సీపీ రవిశంకర్, ఏసీఏ కార్యదర్శి గోపీనాథ్‌రెడ్డి

విశాఖ స్పోర్ట్స్: విశాఖ వేదికగా నవంబర్ 23న జరిగే భారత్-ఆస్ట్రేలియా తొలి టీ-20 క్రికెట్ మ్యాచ్ జోష్ అప్పుడే మొదలైంది. ఆస్ట్రేలియాతో మ్యాచ్ అంటే భారీగా అభిమానులు తరలివస్తారు. వైఎస్సార్ ఏసీఏ-వీడీసీఏ క్రికెట్ స్టేడియం సామర్థ్యం 27 వేలు. మరి టికెట్లు దొరకని వారి పరిస్థితి ఏంటి? అందుకే ఈ సారి ఐపీఎల్ తరహాలో సాగరతీరంలో భారీ ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటుకు క్రికెట్ సంఘం సన్నాహాలు చేస్తోంది. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో టికెట్లను పకడ్బందీగా విక్రయించాలని మ్యాచ్ నిర్వాహక కమిటీ నిర్ణయించింది.

స్టేడియంలో మంగళవారం మ్యాచ్ నిర్వాహక కమిటీ సమావేశం జరిగింది. కమిటీ చైర్మన్, కలెక్టర్ ఎ.మల్లికార్జున, నగర పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి గోపీనాథ్‌రెడ్డి తదితరులు సమావేశంలో పాల్గొని పలు అంశాలపై చర్చించారు. అనంతరం స్టేడియం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు.

పూర్తి సహకారం అందిస్తాం

ప్రపంచ క్రికెట్ కప్ పూర్తయిన తర్వాత భారత్, ఆస్ట్రేలియా జట్లు టీ-20 సిరీస్‌లో భాగంగా తొలి మ్యాచ్‌ను విశాఖ వేదికగా ఆడనున్నాయి. ఇంకా నెల రోజులకు పైగానే సమయం ఉన్నా.. ఇప్పటి నుంచే ఏర్పాట్లు ప్రారంభించామని కమిటీ చైర్మన్, కలెక్టర్ ఎ.మల్లికార్జున వెల్లడించారు. మ్యాచ్ నిర్వహణకు ఎలాంటి ఏర్పాట్లు చేయాలనే అంశంపై సమీక్ష చేసినట్లు చెప్పారు. గతంలో జరిగిన పొరపాట్లను సరిదిద్దుతూ.. టికెట్ల విక్రయాల్లో ఎలాంటి అవకతవకలు జరగకుండా అన్ని శాఖల సమన్వయంతో చర్యలు చేపడతామన్నారు. మ్యాచ్ సజావుగా సాగేందుకు అధికార యంత్రాంగం బీసీసీఐ, ఏసీఏకు పూర్తి సహకారం అందిస్తుందన్నారు. ఆటగాళ్ల కోసం గ్రీన్ చానల్ ఏర్పాటు చేస్తామని వివరించారు. నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ మాట్లాడుతూ ఇరు జట్ల ఆటగాళ్ల భద్రతతో పాటు ప్రజలు, అభిమానుల బాధ్యత తీసుకుంటామన్నారు. ప్రవేశానికి తగిన ఏర్పాట్లతో పాటు మ్యాచ్ పూర్తయిన వెంటనే ట్రాఫిక్ నియంత్రించేందుకు సమీక్ష చేశామన్నారు. నగరంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే అభిమానులకు అసౌకర్యం లేకుండా తగిన చర్యలు చేపడతామన్నారు. టికెట్ల విక్రయ కౌంటర్ల వద్ద భద్రత కల్పిస్తామన్నారు.

అన్ని రాష్ట్రాల ప్రతినిధులను ఆహ్వానిస్తాం

మ్యాచ్ నిర్వహణ, ఏర్పాట్లపై కమిటీ పూర్తిస్థాయిలో చర్చించిందని ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎస్ఆర్ గోపీనాథ్ రెడ్డి తెలిపారు. స్టేడియంలోకి ఆహార పదార్థాలు, పారిశుద్ధ్యం, మంచినీరు సరఫరా తదితర ఏర్పాట్లు చేస్తామన్నారు. దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు చెందిన క్రికెట్ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులను మ్యాచ్ చూసేందుకు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. అభిమానులను దృష్టిలో పెట్టుకుని ఐపీఎల్ తరహాలో సాగరతీరంలో భారీ స్క్రీన్ ఏర్పాటు చేసేందుకు కమిటీ నిర్ణయించిదని వివరించారు.

లాంచీ ఎక్కేద్దాం.. సాగరదుర్గను చూసొద్దాం..


సాగరదుర్గ ఆలయం

- యారాడ కొండపై సముద్రమట్టానికి 125 మీటర్ల ఎత్తులో సాగరదుర్గ ఆలయం
- ప్రకృతి అందాలకు నెలవు
- నవరాత్రుల్లో బోటు సౌకర్యం
- క్యూ కడుతున్న భక్తులు,పర్యాటకులు


సాగరదుర్గ ఆలయానికి బోటు వెళుతున్న భక్తులు


విశేష అలంకరణలో సాగరదుర్గ

దాబాగార్డెన్స్: అలల సవ్వడి.. పచ్చని ప్రకృతి.. చుట్టూ కొండలు.. ఇసుక తిన్నెలు...సాగర తీరాన లాంచీ ప్రయాణం..వావ్ అద్భుతం.. సాగరదుర్గ ఆలయానికి విహారయాత్ర మొదలైంది..అలల చెంత సాగే లాంచీ ప్రయాణం.. మరుపురాని ఓ మధురానుభూతి. శరన్నవరాత్రులు సందర్భంగా యారాడ కొండపై సాగరదుర్గ దర్శనం కోసం బోటు షికారుకు అవకాశం కల్పించారు. ఇంకెందుకు ఆలస్యం బోటులో షికారుకు వెళుతూ అమ్మవారిని దర్శనం చేసుకోండి.

ప్రకృతి అందాలకు నెలవైన విశాఖలో కడలి తీరాన సాగర దుర్గ సన్నిధి దసరా శోభతో అలరారుతోంది. ఆలయ ప్రాశస్త్యం ఒక ఎత్తు కాగా..కళ్లను కట్టిపడేసే ప్రకృతి సౌందర్యం మరో ఎత్తు. ఏరియల్ వ్యూ పాయింట్ నుంచి ఓ వైపు పోర్టు అందాలు, మరోవైపు నగరం. ఇంకో వైపు యారాడ బీచ్ చూపు మరల్చనీయవు.

సాగరదుర్గ పేరు వచ్చిందిలా..

పోర్టు నిర్మాణ సమయంలో చేపట్టిన తవ్వకాల్లో కాంట్రాక్టర్‌కు శ్రీచక్రం లభ్యమైందని, అమ్మవారు కలలో కనిపించి కొండపై ఆలయం నిర్మించమనడంతో 1969లో పోర్టు అధికారులు గుడి కట్టించారని చెబుతారు. సాగరంలో దొరికిన అమ్మవారు కావడంతో సాగరదుర్గగా ప్రసిద్ధి.

ఎక్కడ ఉంది..

యారాడ కొండపై సముద్రమట్టానికి 125 మీటర్ల ఎత్తులో ఉంది సాగరదుర్గ ఆలయం. నిత్యం ధూప దీప నైవేద్యాలతో కళకళలాడాల్సి ఉన్నా సరైన రవాణా సదుపాయం లేక కేవలం దసరా సమయంలో మాత్రమే భక్తుల సందర్శనం కల్పిస్తున్నారు. ఈ పది రోజులు ఆలయ నిర్వాహకులు బోటు సౌకర్యం ఏర్పాటు చేశారు.

నవరాత్రుల్లో ప్రత్యేక పూజలు

నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారు విశేష అలంకరణల్లో దర్శనమిస్తున్నారు. ఆలయం ఉదయం 4.30 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు తెరిచి ఉంటుంది. ఉదయం 4.30కు అమ్మవారికి పంచామృతాభిషేకాలతో ప్రారంభమై రాత్రి నక్షత్ర హారతితో ముగుస్తాయని ఆలయ ప్రతినిధి తెలిపారు.

ఎలా చేరుకోవాలి..

సాగరదుర్గ ఆలయానికి చేరేందుకు రెండు మార్గాలున్నాయి. ఒకటి షిప్‌యార్డ్ మీదుగా బస్సు సౌకర్యం కాగా..రెండోది పోర్టు వేంకటేశ్వరస్వామి గుడి నుంచి బోటు మార్గం. పోర్టు వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద వాహనాలు నిలిపివేసి బోటు ద్వారా అవతలి ఒడ్డుకు చేరుకోవాలి. బోటుకు రాను, పోను రూ.40 చార్జి చేస్తున్నారు. అక్కడి నుంచి గుడికి 2 కిలోమీటర్లు ఉంటుంది. అంతవరకు ఫ్రీ ఆటో సర్వీసులు నడుపుతున్నారు. మెట్ల మార్గంలోనూ గుడికి చేరుకోవచ్చు. ఉదయం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే బోటు సౌకర్యం అందుబాటులో ఉంటుందని బోటు యజమానులు తెలిపారు. మిగతా సమయాల్లో వెళ్లాలంటే షిప్‌యార్డు మీదుగా చుట్టూ 30 కిలోమీటర్లు తిరిగి వెళ్లాలి. అదీ ప్రైవేట్ వాహనాలు, సొంత వాహనాలు ఉంటేనే వీలవుతుంది.

బోట్ జర్నీ బాగుంది



మాది విజయనగరం జిల్లా శృంగవరపుకోట. కుటుంబ సభ్యులు సాగరదుర్గ ఆలయం గురించి చెబితే ఆసక్తి కలిగింది. ఇప్పుడు ప్రత్యక్షంగా చూశా. ఎంతో ఆహ్లాదకరంగా ఉంది. కుటుంబసభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నాం. బోటులో ప్రయాణించడం మంచి అనుభూతినిచ్చింది.

–కృష్ణవేణి, ఉపాధ్యాయురాలు, ఎస్.కోట

ఆధ్యాత్మికం..ఆహ్లాదం



ఆధ్యాత్మికంగా..ఆహ్లాదకరంగా ఈ ప్రాంతం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ప్రశాంత వాతావరణంలో తల్లి దర్శన భాగ్యం కల్గింది. అమ్మ దర్శనం కోసం ఎస్.కోట నుంచి వచ్చా. బోటుపై ప్రయాణించి అమ్మవారి దర్శ నం చేసుకోవడం మంచి అనుభూతినిచ్చింది.

–గ(త్రె)డ్డి రమాదేవి, ఎస్.కోట

ఏటా వస్తుంటాం..



సాగరదుర్గ గుడి పరిసర ప్రాంతాలు ప్రశాంతంగా ఉంటాయి. అమ్మవారిని దర్శించుకునేందుకు నవరాత్రుల్లోనే వీలవుతుంది. దీంతో ప్రతి ఏడాది పిల్లలతో కలసి వస్తుంటాం. బోటుపై వెళ్లడమంటే పిల్లలు చాలా సరదా పడతుంటారు.

–వర్రి వరలక్ష్మి, మహారాణిపేట

బోటు షికారు ఆహ్లాదాన్నిచ్చింది



నవరాత్రుల్లో అమ్మ దర్శనం కలిగింది. అంతేగాక నిత్యం ఒత్తిడితో ఉన్న మాలాంటి వారికి బోటు షికారు ద్వారా కొంత ఉపశమనం. సముద్రంపై బోటు ప్రయాణం ఆహ్లాదాన్ని కలిగించింది.

–సీహెచ్ రాజేశ్వరి, హాసిని మెడికల్స్

ఇదే తొలిసారి..



విశాఖ వచ్చి దాదాపు 20 ఏళ్లయ్యింది. ఇంత వరకు ఇలా బోటు మీద సాగరదుర్గ కొండ(యారాడకొండ)కు దారి ఉన్నట్టు నాకు తెలీయదు. ఓ వైపు బోటు షికారు..మరోవైపు సాగరదుర్గమ్మ దర్శనం ఎంతో అనుభూతినిచ్చింది.

–నాగమణి, ప్రైవేట్ ఉద్యోగి

ఫిర్యాదులకు తక్షణమే పరిష్కారం

- పోలీస్ కమిషనర్ రవిశంకర్
- డయల్ యువర్ సీపీకి 14 ఫిర్యాదులు

దొండపర్తి: డయల్ యువర్ సీపీ కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ పోలీస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సీపీ తన చాంబర్ నుంచి నిర్వహించిన డయల్ యువర్ సీపీ కార్యక్రమానికి 14 మంది కాలర్స్ ఫోన్ చేసి ఫిర్యాదులు చేశారు. సీపీ రవిశంకర్ ప్రతి ఒక్క కాలర్‌తో సమస్యలను తెలుసుకుంటూ సంబంధిత అధికారులతో తక్షణమే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. వెంటనే ఆ ఫిర్యాదులను పరిష్కరించాలని చెప్పారు. కాలర్స్ ఇచ్చిన ఫిర్యాదుల్లో భూ వివాదాలు, భార్యభర్తల గొడవలు, సివిల్ కేసులు, వ్యాపారం కోసం నగదు ఇచ్చి మోసపోయిన వారు, నగర ట్రాఫిక్ సమస్యలకు సంబంధించినవి ఉన్నాయి. ప్రతి నెలా 1, 15 తేదీల్లో నిర్వహిస్తున్న డయల్ యువర్ సీపీ కార్యక్రమంలో 0891–2523408 నెంబర్‌కు కాల్ చేసి ప్రజలు తమ సమస్యలు నేరుగా తెలియజేయవచ్చని సూచించారు. అలాగే 9493336633 వాట్సాప్ నెంబర్ ద్వారా ఫొటోలు, వీడియోలతో ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీసీపీ(అడ్మిన్) ఎం.ఆర్.కె.రాజు, ఏడీసీపీ(ఎస్‌బీ) ఇ.నాగేంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

20న జాబ్‌మేళా

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఈ నెల 20వ తేదీ ఉదయం 10 గంటలకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా సబ్ రీజినల్ ఎంప్లాయిమెంట్ అధికారి నిట్టాల శ్యామ్ సుందర్ తెలిపారు. మ్యాంగో మోటార్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో 50 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నామన్నారు. పెయింటర్, వాషింగ్, సర్వీస్ అడ్వైజర్, మార్కెటింగ్ సేల్ ఎగ్జిక్యూటివ్, టీమ్ లీడర్, సేల్స్ మేనేజర్ ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్మీడియట్, ఏదైనా డిగ్రీ, డిప్లమో, ఎంబీఏ ఉత్తీర్ణత సాధించిన 18–45 ఏళ్ల పురుష, మహిళా అభ్యర్థులు అర్హులన్నారు. ఆయా ఉద్యోగం బట్టి జీతం నెలకు రూ.15,000–40,000వరకు ఉంటుందన్నారు. విశాఖ, శ్రీకాకుళం, రాజాం ప్రాంతాల్లో పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ncs.gov.in వెబ్‌సైట్ లో తమ పేర్లు రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు.

6,285 మందికి వైద్య సేవలు

మహారాణిపేట: జిల్లాలో మంగళవారం 23 ప్రాంతాల్లో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో 6,285 మందికి వైద్య సేవలు అందించారు. అర్బన్ పరిధిలో 21 ప్రాంతాల్లో 4,922 మందికి, రూరల్‌లో రెండు ప్రాంతాల్లో 1,363 మందికి వైద్య సేవలు అందించినట్లు డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు తెలిపారు. చిన్నబజార్(భీమిలి), స్మిత్ స్ట్రీట్, ఎస్.కె.ఎం.ఎల్ నగర్, కొమ్మాది, బాలాజీనగర్(03), ఎంవీపీ కాలనీ(02), కాగితలవారివీధి, గాంధీనగర్(02), వెంకటేశ్వర నగర్(02), శ్రీరంగాపురం, గౌరీ స్ట్రీట్, అబిద్‌నగర్, అంబేడ్కర్ కాలనీ, మురళీనగర్(03), ఎక్స్‌సర్వీస్‌మెన్ కాలనీ, భానోజీతోట, మంగళపాలెం, ఎరుకు స్ట్రీట్, బుచ్చిరాజుపాలెం(02), పెందుర్తి(01), గోపాలపట్నం(02), మర్రిచెట్లకాలనీ, ఆనందపురం, భీమిలి తదితర ప్రాంతాల్లో ఈ శిబిరాలు జరిగాయి.

నేడు 25 ప్రాంతాల్లో వైద్య శిబిరాలు

జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా బుధవారం అర్బన్ పరిధిలో 23 ప్రాంతాల్లో, రూరల్ పరిధిలో రెండు ప్రాంతాల్లో వైద్య శిబిరాల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

టీడీపీ నేతలకు లీగల్ నోటీసులు

సింహాచలం: చినముషిడివాడలోని సర్వే నంబర్ 123/ 4లో ఉన్న స్థలానికి సంబంధించి టీడీపీ నేతలు బండారు సత్యనారాయణమూర్తి, 97వ వార్డు కార్పొరేటర్ శానాపతి వసంత, ఆమె భర్త శానాపతి శంకరరావు తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై వారికి లీగల్ నోటీసులు పంపించినట్లు మంగళవారం మీడియాతో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే నంబర్ 123/4లో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని నా సోదరుడు శ్రీరామ్మూర్తి కొనుగోలు చేశాడన్నారు. ఆ స్థలంలో మేము చేపడుతున్న ని ర్మాణం అక్రమమని, సర్వే నంబర్ 123/5లో ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి నిర్మా ణాలు కొనసాగిస్తున్నామని బండారు, వసంత, శంకరరావు ఆరోపిస్తున్నారన్నారు. దీనిపై జీవీఎంసీ, జేసీకి కూడా ఫిర్యా దు చేశారన్నారు. కానీ వారి ఆరోపణలన్నీ అవాస్తవమన్నారు. ప్రభుత్వానికి మార్కెట్ ధర చెల్లించి నా సో దరుడు ఆ స్థలాన్ని కొనుగోలు చేశాడని, అందులో నిర్మాణాలు చేపడుతున్నట్లు స్పష్టంగా వివరించామన్నారు. అన్ని ఆధారాలు తమ వద్ద ఉన్నాయని తెలిపారు. అయినా టీడీపీ నేతలు పదే పదే ఆరోపణలు చేస్తున్నారని, నా పరువుకు భంగం వాటిల్లేలా వ్యవహరిస్తున్నారన్నారు. రాజకీయంగా నన్ను దెబ్బతీసేందుకు వారంతా ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో వారికి లీగల్ నోటీసులు పంపించినట్లు చెప్పారు. సంబంధిత స్థలం విషయంలో ఎలాంటి తప్పు జరగడంలేదని స్పష్టం చేశారు. తప్పుడు ఆరోపణలు చేస్తున్న వా రికి తగిన బుద్ధి చెబుతానని హెచ్చరించారు.

20న సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సమావేశం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సమావేశం ఈ నెల 20న నిర్వహిస్తున్నట్లు ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. దేవస్థానానికి చెందిన శ్రీకృష్ణాపురం గోశాలలోని సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు.

పోలీస్ స్టేషన్‌కి తాళం వేసిన మహిళ

- ఫ్లాట్ విషయంలో న్యాయం చేయలేదని నిరసన
- సేల్ అగ్రిమెంట్ చేయలేదంటున్న ఫ్లాట్ యజమాని కుటుంబసభ్యులు
- ఇరువర్గాలను వారిస్తుండగా కళ్లు తిరిగి పడిపోయిన పెందుర్తి సీఐ శ్రీనివాసరావు


పెందుర్తి పోలీస్ స్టేషన్ గేట్‌కి వేసిన తాళం


ఫ్లాట్‌కి సంబంధించి ఎలాంటి సేల్ డీడ్ చేయలేదని చెబుతున్న ఫ్లాట్ యజమాని కుటుంబసభ్యులు

సింహాచలం: పెందుర్తి పోలీస్ స్టేషన్‌కి మహిళ తాళాలు వేసిన సంఘటన మంగళవారం సంచలనం రేకెత్తించింది. సంబంధిత మహిళ తెరపల్లి గౌతమీపార్వతి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. 95వ వార్డు పరిధి కృష్ణరాయపురంలో గ్రీన్‌ట్రీస్ అపార్ట్‌మెంట్స్‌లోని ఒక ఫ్లాట్‌లో నాలుగేళ్లగా గౌతమీపార్వతి కుమారుడు, కుమార్తెతో కలిసి అద్దెకు ఉంటోంది. యజమాని భవిరెడ్డి పేర్లు ఫ్లాట్ అమ్మేస్తానని చెప్పడంతో నగలు అమ్మి రూ.5 లక్షలు అడ్వాన్స్ ఇచ్చి గత మే నెలలో సేల్ డీడ్ రాయించుకున్నట్లు ఆమె చెబుతోంది. గత జూలై నెల నుంచి పేర్ల కుమారుడు, కోడలు, వారి తాలుకా మనుషులు వచ్చి ఫ్లాట్ ఖాళీ చేయాలని తనను ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొంది. దీంతో ఈనెల 13న పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపింది. పోలీసులు ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేశారు.

మంగళవారం ఉదయం తన కూతురు ఒక్కరే ఉన్న సమయంలో పేర్ల కుటుంబ సభ్యులు వచ్చి ఫ్లాట్‌లోని సామగ్రి బయటపడేశారని ఆమె తెలిపింది. విషయం తెలుసుకొని రాత్రి 7 గంటల సమయంలో ఫ్లాట్‌కి వచ్చిన ఆమె తరువాత పెందుర్తి పోలీస్ స్టేషన్‌కి వెళ్లింది. ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదంటూ పోలీస్ స్టేషన్ ప్రహరీ గేటుకు తాళం వేసింది. దీంతో పోలీసులు గౌతమీ పార్వతికి నచ్చచెప్పి తాళం తీయించారు. ఎస్ఐ ఆసిరితాత సిబ్బందితో కలిసి అపార్ట్‌మెంట్‌కి వెళ్లారు. సామగ్రి లోపల పెట్టాలని పేర్ల కుటుంబసభ్యులకు చెప్పారు. ఈ విషయంపై పేర్ల కుమారుడు గురునాథ్, కోడలు మీడియాతో మాట్లాడుతూ అసలు గౌతమీ పార్వతికి ఎలాంటి సేల్ అగ్రిమెంట్ చేయలేదని తెలిపారు. అద్దె కూడా మూడు నాలుగునెలలకోసారి అకౌంట్లో వేసేదని, అలాంటిది ఐదు లక్షలు తీసుకోవడం ఏంటని పేర్కొన్నారు. తాము కె.కోటపాడు మండలం గుల్లేపల్లి గ్రామంలో నివసిస్తున్నామని.. కృష్ణరాయపురంలోని సొంత ఫ్లాట్‌కి వచ్చేద్దామని ఫ్లాట్ ఖాళీచేయాలని చెబితే ఆమె రాద్ధాంతం చేస్తోందని ఆరోపించారు. ఇదిలావుండగా ఇరువర్గాలకు వాదనలు జరుగుతున్న సమయంలో అక్కడికి వచ్చిన పెందుర్తి సీఐ శ్రీనివాసరావు డీహైడ్రేషన్‌తో కళ్లు తిరిగి పడిపోయాడు. దీంతో పోలీసులు సీఐని చినముషిడివాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.


అపార్ట్‌మెంట్ వద్ద కుమార్తెతో కలిసి గౌతమీపార్వతి


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సీఐ శ్రీనివాసరావు

మహిళ దారుణ హత్య


సుభాషిని మృతదేహం


వివరాలు తెలుసుకుంటున్న ఏసీపీ మోసెస్‌పాల్


నిందితుడు శ్రీనివాస్

పెదగంట్యాడ: మండలంలోని సీతానగరంలో ఓ మహిళ మంగళవారం దారుణహత్యకు గురైంది. న్యూపోర్టు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని ఏవీఎన్ డౌన్ రెల్లివీధికి చెందిన కోడూరు సుభాషిని (45) భర్తతో వివాదాల కారణంగా ఒంటరిగా ఉంటోంది. ఆమెకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. మారికవలసలో మూడేళ్ల నుంచి చిన్ను శ్రీనివాస్‌తో సహజీవనం చేస్తోంది. శ్రీనివాస్‌కు కూడా పెళ్లయి పిల్లలున్నారు. కొన్నాళ్లు ఆమె నవోదయ పాఠశాలలో ఆయాగా పనిచేసింది. ఆ తర్వాత నుంచి ఆమె శ్రీనివాస్‌కు దూరంగా ఉంది. దీంతో అతను కక్ష పెంచుకున్నాడు. ఆమెను అంతమొందించాలని నిర్ణయించుకున్నాడు. 15 రోజులుగా ఆమె మండలంలోని ప్రభుత్వ న్యూ ఐటీఐలో సీటీఐ శిక్షణ తీసుకుంటోంది. ఈ క్రమంలో మండలంలోని సీతానగరంలో ఉంటున్న కానూరి అలివేలు అనే మహిళతో ఆమెకు పరిచయం ఏర్పడింది. వీళ్లిద్దరూ కలసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. ఇటీవల జరిగిన ప్రమాదంలో అలివేలు గాయపడింది. సుభాషిని పరామర్శ కోసం మంగళవారం వచ్చింది. ఈ విషయం తెలుసుకున్న శ్రీనివాస్ అక్కడకు చేరుకున్నాడు. అలివేలుతో మాట్లాడుతున్న సుభాషినిపై కత్తితో దాడి చేశాడు. మూడుసార్లు కత్తితో బలంగా పొడిచాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. వెంటనే స్థానికులు స్పందించి శ్రీనివాస్‌ను పట్టుకుని దేహశుద్ధి చేశారు. న్యూపోర్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐలు శ్రీనివాసరావు, మన్మథరావు సంఘటన స్థలానికి చేరుకొని శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకున్నారు. సంఘటన స్థలాన్ని ఏసీపీ మోసెస్ పాల్ పరిశీలించారు. క్లూస్ టీం అక్కడకు చేరుకొని వేలిముద్రలు, ఆధారాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. న్యూపోర్టు ఎస్ఐలు శ్రీనివాసరావు, మన్మథరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కేకే లైన్లో పలు రైళ్ల గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం: మనబార్–జరాటి స్టేషన్ పరిధిలో ప్రయాణికుల భద్రత దృష్ట్యా ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లకు ఇంకా అనుమతులు ఇవ్వలేదు. దీని కారణంగా పలు రైళ్లను ఆయా తేదీల్లో గమ్యం కుదిస్తున్నట్లు వాల్తేర్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె. త్రిపాఠి తెలిపారు. ఈ లైన్‌లో ప్రస్తుతం గూడ్స్ రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. భువనేశ్వర్–జగదల్‌పూర్ (18447) హిరాఖండ్ ఎక్స్ ప్రెస్ బుధవారం కోరాపుట్ వరకే నడుస్తుంది. జగదల్‌పూర్–భువనేశ్వర్ (18448) ఎక్స్‌ప్రెస్ బుధ, గురువారాల్లో కోరాపుట్ నుంచి బయల్దేరి భువనేశ్వర్ చేరుకుంటుంది. విశాఖ– కిరండూల్ (18514) నైట్ ఎక్స్‌ప్రెస్ బుధవారం కోరాపుట్ వరకే నడుస్తుంది. కిరండూల్–విశాఖ(18513)ఎక్స్‌ప్రెస్‌గా బుధ, గురువారాల్లో కోరాపుట్ నుంచి బయల్దేరుతుంది. బుధ,గురువారాల్లో విశాఖ–కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్ అరకు వరకే నడుస్తుంది. కిరండూల్–విశాఖ (08552) పాసింజర్ స్పెషల్‌గా బుధ, గురువారాల్లో అరకు నుంచి బయల్దేరుతుంది. హౌరా – జగదల్‌పూర్ (18005) సమలేశ్వరి ఎక్స్‌ప్రెస్ బుధవారం టిట్లాఘడ్ వరకే నడుస్తుంది. జగదల్‌పూర్ – హౌరా(18006) ఎక్స్‌ప్రెస్‌గా బుధ, గురువారాల్లో టిట్లాఘడ్ నుంచి బయల్దేరుతుంది. రూర్కెలా–జగదల్‌పూర్ (18107) ఎక్స్‌ప్రెస్ బుధవారం కోరాపుట్ వరకు నడుస్తుంది. జగదల్‌పూర్–రూర్కెల (18108) ఎక్స్‌ప్రెస్ బుధ, గురువారాల్లో కోరాపుట్ నుంచి బయల్దేరి రూర్కెలా చేరుకుంటుంది.


క్యూఆర్ కోడ్ ద్వారా దసరా మామూళ్ల వసూళ్లు

కార్మికుడి సస్పెన్షన్

దాబాగార్డెన్స్: క్యూ ఆర్ కోడ్ ద్వారా దసరా మామూళ్లు వసూళ్లు చేస్తున్న నీటి సరఫరా విభాగం కార్మికుడిని సస్పెండ్ చేశారు. సెమీ బల్క్ వినియోగదారుల నుంచి అవుట్ సోర్సింగ్ కార్మికుడు ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం తదితర యాప్‌ల ద్వారా క్యూఆర్ కోడ్ వినియోగించి దసరా మామూళ్లు వసూళ్లు చేస్తున్నట్టు ఫిర్యాదులు వచ్చాయి. విచారణ అనంతరం నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కేవీఎస్ రవి.. ఆ ఉద్యోగిని సస్పెండ్ చేశారు. విభాగం కార్మికులెవరూ దసరా మామూళ్లు వసూళ్లు చేయరాదని, ఎవరైనా చేసినట్టు తెలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

హార్బర్‌కు అదనపు హంగులు

- ఆధునికీకరణకు అదనపు నిధులు
- రూ.152 నుంచి రూ.178 కోట్లకు వ్యయం పెంపు
- ఈ సొమ్ముతో శాశ్వత జెట్టీ, ఆంక్షన్ హాలు, వార్ఫ్‌ల నిర్మాణం
- మత్స్యకారుల అభ్యర్థనకు సానుకూల నిర్ణయం


విశాఖ ఫిషింగ్ హార్బర్

సాక్షి, విశాఖపట్నం: విశాఖ ఫిషింగ్ హార్బర్‌కు మరిన్ని అదనపు హంగులు సమకూరనున్నాయి. ఇందుకు అవసరమైన నిధులు మంజూరు కానున్నాయి. ఈ హార్బర్ ఆధునికీకరణకు ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద కేంద్ర ప్రభుత్వం రూ.151.81 కోట్లను మంజూరు చేసిన సంగతి తెలిసిందే. ఇందులో ఇప్పటివరకు రూ.22.93 కోట్లను విడుదల చేసింది. మొత్తం ఏడు దశల్లో పనులను పూర్తి చేయాల్సి ఉంది. ఈ చేపలరేవు ఆధునీకీకరణలో భాగంగా తొలి దశలో రూ.37.26 కోట్లతో ప్యాకేజి యూనిట్/కోల్డ్ చాంబర్, పార్కింగ్ ఏరియా, రోడ్లను ఏర్పాటు చేస్తారు. ఫేజ్–2లో విద్యుత్ పనులు, ఫేజ్–3లో రెండు ఆక్షన్ హాళ్లు, రిటైనింగ్ వాల్, ఫేజ్–4లో ఎఫ్లుయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, ఫేజ్–5లో ఫ్లోటింగ్ జెట్టీ, ఫేజ్–6లో డ్రెడ్జింగ్ పనుల నిర్వహణ, ఫేజ్–7లో టైర్ ఫెండర్ల ఏర్పాటు వంటివి చేపడతారు. గత డిసెంబర్ నుంచి ఆధునికీకరణ పనులు ప్రారంభమయ్యాయి. ఇంతలో మత్స్యకారులు వివిధ అంశాలపై అభ్యంతరాలను లేవనెత్తడంతో కొన్నాళ్లు పనులకు అంతరాయం కలిగింది. మరో ఆక్షన్ హాలుతో పాటు ప్రస్తుతం ప్రతిపాదించిన ఫ్లోటింగ్ జెట్టీ స్థానంలో శాశ్వత జెట్టీ, వార్ఫ్‌లు. మూడో ఆక్షన్ హాలు నిర్మించాలని, బీచింగ్ పాయింట్‌ను ఏర్పాటు చేయాలని మత్స్యకారులు డిమాండ్ చేశారు. దీనిపై కలెక్టర్ ఎ.మల్లికార్జున వారితో పలుమార్లు సంప్రదింపులు జరిపి మత్స్యకారుల డిమాండ్లపై సానుకూలంగా స్పందించారు. వీటికి అదనంగా నిధులు అవసరమవుతాయని అధికారులు అంచనా వేశారు. దీంతో సవరించిన అంచనాల ప్రకారం ఆధునికీరణకు రూ.151.81 కోట్లకు బదులు రూ.178.51 కోట్ల అంచనాలను ప్రతిపాదించి ఇటీవల కేంద్ర ప్రభుత్వానికి నివేదించినట్టు జిల్లా మత్స్యశాఖ అధికారి జి.విజయ 'సాక్షి'కి చెప్పారు. దీనికి అక్కడ నుంచి ఆమోదం రాగానే వీటి పనులు ప్రారంభానికి అవసరమైన ప్రక్రియను మొదలు పెడతామని ఆమె తెలిపారు.

లక్ష్యం.. 2025 అక్టోబర్..

మరోవైపు మొత్తం ఏడు దశల పనులకు గాను ఇప్పటివరకు ఆరు ఫేజ్‌ల పనులకు వర్క్ ఆర్డర్లు జారీ చేశారు. ఇంతవరకు ఫేజ్–1, 2ల్లో 37 శాతం చొప్పున, ఫేజ్–4లో 8 శాతం, ఫేజ్–6లో 100 శాతం, ఫేజ్–7లో 21 శాతం చొప్పున పనులు పూర్తయ్యాయి. ఇలా సగటున 9.50 శాతం మేర పనులు జరిగాయి. తొలుత నిర్దేశించిన ప్రకారం ఈ హార్బర్ ఆధునికీకరణ పనులను ఈ ఏడాది నవంబరు నాటికే పూర్తి చేయాల్సి ఉంది. కానీ పనులు కొన్నాళ్లు నిలిచిపోవడం, సవరించిన అంచనాలు, అదనపు పనులు చేపట్టనుండడంతో 2025 అక్టోబరు నాటికల్లా పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు.